ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణభాస్కర



## (దర్భరేవులో శ్రీనాన్నగారి ప్రవచనము, 13-7-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

భగవదనుభవం మనం పొందలేకపోయినా భగవదనుభవం పొందాలి అనేకాంక్ష మహత్తరమైనది. జ్ఞానస్థితిని పొందలేకపోయినా పొందాలనే కాంక్ష కూడా పూర్వపుణ్యం లేకపోతే, పూర్వజన్మలో ఎంతోకొంత సత్కర్మచేసి ఉండకపోతే ఆ కాంక్షకూడా కలుగదు. భగవంతుని తెలుసుకోవాలి అనే కోరిక ఉదయిస్తూఉంటే దానికి రెండు కారణములు ఉన్నాయి. (1) పూర్వజన్మలో మనంచేసిన సత్కర్మ (2) భగవదనుగ్రహం. ఈరెండూ ఉంటేగాని మనకి భగవదనుభవం పొందాలనే కాంక్ష ఉదయించదు. భక్తి చిల్లరవిషయాలకు కాకుండా భక్తి భక్తి కోసమే అయితే, భగవంతుని భగవంతుని కోసమే ప్రేమిస్తూఉంటే, సర్వజ్ఞుడు అయిన భగవంతునిపట్ల భక్తి, ప్రేమ కలిగిఉంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము, భౌతికంగా దుఃఖానికి దూరమవుతాము. భగవాన్ తాత్కాలిక విషయాల గురించి ఆలోచించలేదు. మనశరీరం A/C గదిలో ఉన్నప్పుడు ఎలా ఉంటుందో పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మన మనస్సును అలా ఉంచటానికి చూసారు. ఏమిచేస్తే మానవుడు అలా ఉండగలడు అనేదాని గురించి ఆలోచించారు. శీతాకాలంలో మనం దుప్పటిని ఎలా కప్పుకొంటామో అలాగ మనమనస్సును మంచిగుణాలతో కప్పాలి. గుణం జ్ఞానంకాదు. మంచిగుణాలు మనస్సులోనే ఉన్నాయి, చెడు గుణాలు మనస్సులోనే ఉన్నాయి. అయితే మంచిగుణాలు మనస్సు అణగటానికి ఉపయోగపడతాయి. మనస్సును దాని మూలంలోనికి పంపటానికి మంచి గుణాలు ఉపయోగపడతాయి. మనస్సు యొక్క మూలంలోనే ఈశ్వరుడు ఉన్నాడు. మనోమూలంలోనికి వెళ్ళాలంటే సాధన, గురుకృప అవసరము. ఎంతోకొంత సాధన చేయకపోతే, మనస్సు ముగ్గకపోతే వస్తువు అత్యంత సమీపంగా ఉన్నప్పటికీ అది మనకు అర్థంకాదు.

UGK అనే ఆయన ఒకరు భగవాన్ దగ్గరకు వచ్చారు. ఆయన భగవాన్‌తో మీరు జ్ఞానులు అని లోకం అంతా చెప్పుకొంటోంది. మీరు పొందినది నాకు ఇస్తారు అని మీదగ్గరకు వచ్చాను అన్నారు. భగవాన్ మౌనంగా ఉన్నారు. UGK మరల రెట్టించి మీరు పొందిన సుఖాన్ని, శాంతిని నాకు ఇస్తారు అని మీ దగ్గరకు వచ్చాను అన్నారు. అప్పుడు భగవాన్ ఇస్తాను. కాని ఇస్తే నీవు తీసుకోగలవా ? దానిని తీసుకొనే యోగ్యత, అర్హత, శక్తి నీకు ఉందా అన్నారు. అప్పుడు UGK కి ఆలోచన ప్రారంభమయింది. గురువు ఇస్తాను అంటున్నాడు. తీసుకోగలవా అంటున్నాడు అంటే నేను ఇచ్చినా నీవు తీసుకోలేవు, తీసుకొనేశక్తి నీకు లేదు అని అర్థం. అందువలన సాధనచేసి శక్తిని, అర్హతను సంపాదిస్తాను అనుకొని వెళ్ళిపోయారు. ఈశ్వరుడు మనహృదయంలోనే ఉన్నాడు. ఆయన అనుగ్రహించటానికి సిద్ధంగా ఉన్నాడు. కాని అది గ్రహించటానికి మనకు శక్తి ఉండాలి. సాధనలేకపోతే ఆశక్తి, అర్హత మనకురాదు. అర్హతలేకపోతే దానిని మనం గ్రహించలేము.

మనజీవిత గమ్యం ఏమిటి ? మనం పొందవలసింది ఏమిటి ? అనే దానిగురించి చాలామంది

చెప్పారు. ఆ వస్తువును పొందటానికి కావలసిన క్రమశిక్షణ, అర్హత, యోగ్యత మనం కలిగిఉండాలి. ఈశ్వరానుగ్రహం ఎప్పడూఉంది. అది స్వీకరించటానికి కొంత ఆధ్యాత్మికబలం ఉండాలి, సాధన ఉండాలి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. మహాత్ములతోటి, మహర్షులతోటి సాంగత్యం మంచిది. భక్తులతోటి, జ్ఞానులతోటి సాంగత్యం చేస్తూ ఉంటే నీ ప్రయత్నం తక్కువ అయినప్పటికి నీ మనస్సుకు అంతర్దృష్టికలుగుతుంది. సత్పురుషులతో సహవాసం వలన వస్తువును తెలుసుకోవాలనే కాంక్ష హృదయాంతరాళములనుండి ఉబికి వస్తుంది. దుష్టులతో సహవాసం చేస్తే లోకవాసన పెరుగుతుంది. ఈజన్మలో ఏదో కారణంవలన దుఃఖం వస్తోంది. ఆకారణం పోతే చాలు అనిపిస్తుంది. తరువాత జన్మలో ఇంకో కారణం వలన దుఃఖం వస్తుంది. అదిపోతే చాలు అనిపిస్తుంది. ఇలాంటి చిల్లరగొడవలలోనికి వెళ్ళవద్దు. ఇలా తాత్కాలికంగా ఆలోచించవద్దు. నీకు దేహబుద్ధి ఎంతకాలం అయితే ఉంటుందో అంతకాలం ఏదోరూపంలో దుఃఖం వస్తూనే ఉంటుంది. తాత్కాలికంగా ఏదో ఉపాయం వలన ఆ దుఃఖాన్ని తగ్గించుకొన్నా ఇంకోదుఃఖం వస్తుంది. దేహబుద్ధి ఉంటే భేదబుద్ధి వస్తుంది. భేదబుద్ధి వలన మనిషికి దుఃఖం వస్తుంది. దేహబుద్ధి ఎంతకాలం అయితే నశించదో అంతకాలం దేహాలు వస్తూనే ఉంటాయి. ఎవడికైతే ఆత్మబుద్ధి కలిగిందో ఇంకవాడికి పునర్జన్మ ఉండదు. తాత్కాలిక విషయాలను దృష్టిలో పెట్టుకోవద్దు. దేహబుద్ధి నశిస్తే పునర్జన్మలేని స్థితికి వెళతావు.కంగారుపడవద్దు. మోక్షం వస్తుందా రాదా అనే అనుమానం వద్దు. మీరు అందరూ మోక్షాన్ని పొందుతారు. గురువు అనుగ్రహం వలన ఆస్థితిని పొందుతారు. దానికోసం కొంత ప్రయత్నం చేయండి.

మాకర్మ ఇలాఉంది అని చాలమంది అంటూఉంటారు. కర్మఅంటే నువ్వు పూర్వజన్మలో పుణ్యంచేస్తే ఆపుణ్యం సుఖరూపంలో వస్తుంది, పాపంచేస్తే ఆపాపం దుఃఖరూపంలో వస్తుంది. ఈ రెండూ కూడా అనుభవస్తేపోతాయి. నీహృదయంలో భగవంతుడు ఉన్నప్పటికీ నీకు తెలియకపోవటానికి నీ వాసనే కారణం అన్నారు భగవాన్. మనజన్మకు కూడా వాసనే కారణం. ఆవాసనలను కారణం ఏమిటి ? రుచి అనుభవించటం వలన మనకు వాసనపడుతోంది. ఎవరి ఇంటిదగ్గర అయినా పాయసం తీసుకొన్నారు అనుకోండి. పాయసం బాగుంది అనుకోండి మరల తీసుకోవాలి అనిపిస్తుంది. రుచి అనుభవించేటప్పడు, సుఖాన్ని అనుభవించేటప్పడు మీ మనస్సులో ముద్రపడుతుంది. దానినే వాసన అంటారు. ఒకో ఇంద్రియానికి ఒకో విషయం ఉంటుంది. దానికి సంబంధించిన రుచికి అలవాటుపడ్డప్పడు అదివాసనగా పడుతుంది. దేహంలేకుండా వాసన వ్యక్తంకాదు. అందుచేత వాసనానుగుణంగా మీకు పరమేశ్వరుడు దేహాన్ని ఇస్తాడు. రుచినిబట్టి వాసనపడుతుంది. వాసననుబట్టి పునర్జన్మ కలుగుతుంది..ఇవి అన్నీ ప్రకృతి గొడవలు. నిజమైన సుఖం అనుభవించేటప్పడు సూర్యుని ముందు కిరసనాయిలు దీపం ఎలా ఉంటుందో నిజమైన సుఖంముందు నీ ప్రారబ్దం వలన వచ్చే సుఖం అయినా, దుఃఖం అయినా అలాగే ఉంటుంది. నీవు భోగం అనుభవిస్తున్నా దుఃఖం అనుభవిస్తున్నా రెండు స్వప్న సమానమే. స్వప్నంలో దేహాలు కల్పించబడతాయి. అదేవిధంగా ఈ జాగ్రదావస్థలోని దేహాలు కూడా కల్పించబడిన దేహాలే. నీవు అనుభవించే సుఖం, దుఃఖం కూడా అటువంటివే. నీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాసన నశింపజేయటానికి ప్రయత్నం చెయ్యి. వాసన నశిస్తే నీలోపల ఉన్న స్వరూపం నేనుగా, తానుగా నీకు వ్యక్తమవుతుంది. తాత్కాలిక గొడవలు పెట్టుకోవద్దు. మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి, మాకు రోజులు బాగా

వెళ్ళటంలేదు కష్టపడుతున్నాము అంటారు. అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే ఈ గొడవలు వద్దు. గురువుని ఆశ్రయించి, నీకు ఏ వాసన ఉందో చూసుకొని ఆవాసన తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు సుఖపడతావు.

పూజకంటే, జపంకంటే, ధ్యానంకంటే గురువు అనుగ్రహం అత్యంత శక్తివంతమైనది. ఎంత బరువైన దుఃఖం మీలో ఉన్నా గురువు అనుగ్రహంవలన ఆ దుఃఖం అంతా బయటకు కొట్టుకొనిపోతుంది. నిజమైన గురువు నీ హృదయంలోనే ఉన్నాడు. బయట ఉన్న గురువుకు ఆయనకు ఏమీ తేడాలేదు. నిన్ను అంతర్ముఖస్థితికి తీసుకొనివెళ్ళటానికి లోపల ఉన్నగురువు రూపం ధరించి వచ్చాడుగాని వాడికి సొంతపని అంటూ ఈసృష్టిలో ఏమీలేదు. సృష్టేలేనివాడికి పనిఏమిటి? గురువుతో మానసిక అనుబంధం పెట్టుకోండి గురువుతో మానసికఅనుబంధం పెట్టుకోవటంవలన మనం పరమేశ్వరుడిలో ఐక్యం అవుతాము. దేహం ఎక్కడ ఉన్న గురువుతో మానసిక అనుబంధం పెట్టుకొంటే మనపనిపూర్తి అవుతుంది. గురువు అంటే దేహంకాదు. నిన్ను అనుగ్రహించేది కూడా దేహంకాదు. ఏదైతే అనుగ్రహిస్తోందో దానికి దేహంతో పనిలేదు. అనుగ్రహించేది ఎప్పుడూ ఉంటుంది. గురువు అంటే ఆత్మ చైతన్యం. నిజమైన వస్తువును సత్యవస్తువును తెలుసుకొనే వరకూ మనం ఎక్కడ జన్మించినా స్వర్గంలో ఉన్నా, నరకంలో ఉన్న, బహుపేదవారి ఇంటిలో పుట్టినా, కోట్ల రూపాయిలు ఉన్నవారి ఇంటిలో పుట్టినా మనకు స్వాతంత్ర్యము లేదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మానవుడు వాసనల నుండి విడుదల పొందినపుడు మాత్రమే నిజమైన స్వాతంత్ర్యము కలుగుతుంది. ధనం ఉన్నవారు సుఖంగా ఉన్నారు అని ధనంలేనివారు అనుకొంటారు. వారుకూడా సుఖంగాలేరు. ఎవడైతే వాసనారహితుడో వేరుతో సహా వాసన నశించిందో వాడు మాత్రమే సుఖి అవతాడు.

మాటకంటే మౌనం అత్యంత శక్తి వంతమైనది. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటంకాదు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడనుండి మౌనం విజృంభిస్తుంది. నిజమైన మౌనం మీకు కలిగినప్పడు ఈ సృష్టిని అంతా ఆలింగనము చేసుకోవాలి అనిపిస్తుంది. సృష్టిమీద అంత ప్రేమ కలుగుతుంది. ఆమౌనం మీకు ఎంతో చల్లదనాన్ని కలుగజేస్తుంది. మౌనంగా కూర్చొన్నవాడు ఏమీ మాట్లాడటంలేదు అనుకోవద్దు. నిశ్శబ్దంగా మాట్లాడతాడు. మౌనం నుండి వచ్చే శక్తి తరంగాలు నీ హృదయం యొక్క లోతుల లోనికి నిశ్శబ్దంగా ప్రవేశిస్తాయి. ఎన్నో సంవత్సరాల తరబడి అనుభవించవలసిన కర్మ కూడాకొన్ని క్షణాలలో అనుభవింపజేసి పోగొడుతుంది. గురువు అనుగ్రహం యొక్క వేగం అటువంటిది. వాసన బలీయంగా ఉన్నప్పడు ఆ వాసనలో నుండి బయట పడలేమని మీకు అనిపిస్తుంది. కంగారు పడవద్దు. ప్రయత్నం ప్రారంభించండి. మీ ప్రయత్నం వెనకాలే గురువు అనుగ్రహం వెంటాడుతూ ఉంటుంది. మీరు కొంచం ప్రయత్నం చేస్తే ఆ ప్రయత్నమును వంపు పెట్టుకొని గురువు అనుగ్రహం అనే వరద వచ్చి వాసనలు అన్నీ బయటకు కొట్టుకొని పోతాయి.

మీకు అశాంతి ఉన్నా, దుఃఖం ఉన్నా అది ఎప్పడూ అలాగే ఉంటుంది అని అనుకోవద్దు. రాత్రి తరువాత పగలు ఎలా వస్తుందో అలాగ అశాంతి తరువాత శాంతి వస్తుంది. నీకు ఎంత దుఃఖం ఉన్నా ఆ దుఃఖంలోనుండి బయటపడి సుఖపడే రోజు వస్తుంది. మనస్వరూపంలో అశాంతిలేదు, దుఃఖంలేదు. ఇవిఅన్నీ మనం కల్పించుకొన్న విషయములే. కల్పించుకొన్న విషయాలను వదిలివేస్తే ఉన్నశాంతి, సుఖంఏదో మనకు వ్యక్తమవుతుంది. నీస్వరూపంలో అజ్ఞానంలేదు. నీస్వరూపంలో

అజ్ఞానం ఉంటే నీవు సాధనచేసినా అదిపోదు. నీస్వరూపంలో ఉన్నది జ్ఞానమే. నీవు కల్పించుకొన్న వాటిని వదిలివేస్తే ఉన్నదిఏదో నీకు తెలుస్తుంది. వైకుంఠములో దేవుడులేడు, కైలాసంలో దేవుడు లేడు అని నేను చెప్పటంలేదు. వైకుంఠములో దేవుడు ఉన్నాడు అనుకొన్నవాడికంటే, కైలాసంలో దేవుడు ఉన్నాడు అనుకొన్నవాడికంటే హృదయంలో దేవుడు ఉన్నాడు అని హృదయంలో ఉన్న స్పందన ఎవడికైతే తెలుస్తోందో వాడికి తొందరగా మనస్సు పక్వానికి వస్తుంది, జ్ఞానం కలుగుతుంది.

హృదయంలో ఉన్న వస్తువు నిన్ను పట్టుకోగలదు గాని నీ తెలివితేటలతో ఆవస్తువును నువ్వు పట్టుకోలేవు. శరీరం ఉండటం, లేకపోవటంతోటి, ప్రపంచం కనిపించటం, కనిపించకపోవటం తోటి దానికి సంబంధంలేదు. అది ఎప్పడూ అలాగే ఉంటుంది. అన్నం కలుపుకొనేటప్పడు ప్రక్కవాడితో మాట్లాడతాము. ముద్దనోటిలో పెట్టుకొన్నాక మాటపడిపోతుంది. అలాగే హృదయంలో ఉన్న వస్తువు తెలిసాక మాట అణిగిపోతుంది. మనస్సు అణిగిపోతుంది. సాధన దశలోనే గొడవ అంతా సిద్ధికలిగాక ఏ గొడవలేదు. ఇప్పడు మనం కలుపుకొనే గొడవలోనే ఉన్నాము ముద్ద ఇంకా నోటిలోనికి వెళ్ళలేదు. నీ స్వరూపాన్నీ పట్టి ఇచ్చేదే ఉపదేశం. దానికి మాట అక్కరలేదు. మౌనం ద్వారాకూడా ఉపదేశం జరిగిపోతుంది. నీకు అత్యంత సమీపంగా ఏవస్తువు అయితే ఉందో నీవు ఏదిగా ఉన్నావో అక్కడికి తీసుకొని వెళ్ళేదే ఉపదేశం, అక్కడకు తీసుకొని వెళ్ళేదే ఉపవాసం. మనస్సు పక్వానికి వచ్చినవారికి మాత్రమే మౌన సందేశం అందుతుంది. ఇంట్లో బంగారం ఉన్నవాడికంటే మనస్సును ఎవరైతే బంగారం చేసుకొన్నారో వారికి జ్ఞానం కలుగుతుంది. బ్రహ్మం ఎంత పవిత్రమైనదో ఎవడి మనస్సు అయితే అంత పవిత్రం అయిందో వాడు మహాపురుషుడు, బ్రహ్మం ఏ విధంగా అయితే ఏకంగా ఉందో అలాగ ఎవడి మనస్సు అయితే అనేకంగా కాకుండా ఏకంగా ఉంటుందో, ఒక్కటే అనేకమైనది కాబట్టి అనేకంలో ఉపాధులను చూడకుండా వాటిలో ఒక్కటినే చూస్తున్నాడో వాడు మహాపురుషుడు. వారి సహవాసం దొరికితే ఇంక నీకు ఏమి కావాలి అంటున్నారు ఆచార్యులవారు.

నదులలో మునగటం, విగ్రహల చుట్టూ తిరగటం జ్ఞానియొక్క చూపుకంటే తక్కువస్థాయిలోనివి. నీమనస్సును పవిత్రం చేసుకోవటానికి నదులలో మునుగుతున్నావు, విగ్రహాలచుట్టూ తిరుగుచున్నావు. ఈ నదులలో మునగటంకంటే, విగ్రహల చుట్టూ తిరగటంకంటే జ్ఞానియొక్క ఒక్కచూపు నీమనస్సును అతివేగంగా పవిత్రం చేస్తుంది. ఏ లక్ష్యంకోసం ఇవి అన్నీ నీవు చేస్తున్నావో జ్ఞానియొక్క చూపు ఆ ఫలితాన్ని తెచ్చిపెడుతుంది. కొంతమందికి పట్టుదల ఒక్కటే ఉంటుంది. ప్రయత్నం ఉండదు. పట్టుదల ఒక్కటే సరిపోదు. పట్టుదలతో పాటు ప్రయత్నం ఉంటే అనుకొన్నది సాధించగలరు.

రాముడు, లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పడు ఆమూర్ఛ నుండి బయటకు తీసుకొని రావటానికి ఆంజనేయస్వామి ఒక కొండను తీసుకొని వస్తాడు. ఆ కొండకంటే అరుణగిరి గొప్పది అన్నారు భగవాన్. ఆ కొండమీద ఉన్న మూలికలు మూర్ఛ నుండి వారిని బయటకు తీసుకొని రావటానికి ఉపయోగపడ్డాయి, కాని అరుణగిరి జ్ఞానమును ఇచ్చే కొండ అన్నారు. ఇది ఒక జ్ఞాని నోటినుండి వచ్చినవాక్కు అరుణాచలం అందరినీ ఆకర్షించదు. పూర్వజన్మలలో ఎవరైతే జ్ఞానమార్గంలో ప్రయాణించారో వారిని మాత్రమే అరుణాచలం ఆకర్షిస్తుంది. నీ మాంసపు నేత్రాలకు రాళ్ళగుట్టులా కనిపిస్తోంది, కాని అది జ్ఞానగిరి, శాంతగిరి. నీమనస్సును అణిచేకొండ. కైలాసంలో శివుడు ఉన్నాడు. కాని ఈకొండమీద శివుడు ఉండటంకాదు. సాక్షాత్తు శివుడే ఈకొండరూపం ధరించాడు.